క్లుప్తంగా

మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా

• రూరల్ సీఐ రవికుమార్



పార్వతీపురం టౌన్: ఏఓబీ సరిహద్దు గ్రామాల్లో మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏఓబీ సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒడిశా నుంచి సారా, గంజాయి వంటి నిషేధిత వస్తువులు దిగుమతి అయ్యే అవకాశం ఉన్నందున రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ హైందవ సైన్యం ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు హైందవ సైన్యం కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సందర్శన



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: మున్సిపల్ పరిధిలో గల చర్చివీధి, జగన్నాథపురం మున్సిపల్ పాఠశాలలను ఎంఈఓ -1 సామల సింహాచలం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిలబస్ ఎంతవరకు పూర్తి చేసిందీ ఆరా తీశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. జగన్నాథపురం మున్సిపల్ పాఠశాల 5వ తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా పఠనా సామర్థ్యాలను పరిశీలించి, బాగా చదివిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'క్షయ'పై ఉపాధి వేతనదారులకు అవగాహన



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న టీబీ యూనిట్ సిబ్బంది

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సును ఏరియా ఆస్పత్రి పరిధిలోని టీబీ యూనిట్ ఉద్యోగులు నిర్వహించారు. సూపర్‌వైజర్ టి.నరేష్, ఏఎన్ఎం సన్యాసమ్మ, ఆశ వర్కర్లతో కలసి శివరాంపురం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు క్షయ వ్యాధిపై బుధవారం అవగాహన కల్పించారు. తరచూ పొడి దగ్గు వస్తే వెంటనే కెల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. గాలి వెలుతురు లేని ప్రదేశాల్లో ఉండరాదన్నారు. క్షయవ్యాధి సోకిన వ్యక్తికి దగ్గరగా ఉండరాదని, అయితే ఈ వ్యాధి ప్రాణాంతకం కాదని పేర్కొన్నారు.

అమ్మవారి ఘటాల తిరువీధి



బంగారమ్మతల్లి గద్దె వద్ద తిరువీధికి సిద్ధంగా ఉన్న ఘటాలు

మక్కువ: మండలంలోని కొండబుచ్చమ్మపేట గ్రామదేవత బంగారమ్మతల్లి(అమ్మవారి) ఘటాలను బుధవారం గ్రామంలో తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. బంగారమ్మతల్లి గద్దె వద్ద ఘటాలకు, పాలధారకు పుజారి కుటుంబీకులు అలంకరించారు. అమ్మవారి ఘటాలను గ్రామంలోని అన్ని వీధులలో తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. పాలధారకు గ్రామస్తులు పూజలు చేసి, పుజారులు అందించిన ముగ్రాటను అందుకున్నారు.

సారా తరలిస్తూ...

పాలకొండ రూరల్: మండలంలోని సింగన్నవలస మీదుగా పాలకొండ పట్టణంలోకి 20 లీటర్ల సారా తరలిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఎస్.ప్రశాంత్ కుమార్ నేతృత్వంలో బుధవారం రూట్ వాచ్ చేపడుతుండగా సీతంపేట మండలం వజ్జాయిగూడ గ్రామానికి చెందిన సవర రామరాజు సారా తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పార్వతీపురంలో ప్రగతి పవనాలు

• ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ నిర్మాణం పూర్తి
• తోటపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి నిరంతరాయంగా తాగునీరు సరఫరా
• ఆహ్లాదం కల్పించేలా పార్కులు
• ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు



పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ



బైపాస్ రోడ్డు

పార్వతీపురం టౌన్: ఒకప్పుడు పార్వతీపురం అంటే అందరికీ చులకనే. కొందరు సినీ రచయితలు సైతం తమ సినిమా పాటల్లో 'బతుకు పార్వతీపురం బస్టాండే' అనే పదాలు వాడేవారు. గత పాలకుల నిర్లక్ష్యం.. సరైన నాయకుడు లేక పార్వతీపురం అభివృద్ధికి కాస్త దూరంగా ఉండేది. ఇక్కడి బైపాస్ రోడ్డును నరకానికి దారిగా పేర్కొనేవారు. వరహాల గెడ్డ పూడికలు, వ్యర్థాలతో మురుగు కాలువలా కనిపించేది. వర్షాకాలంలో గెడ్డ పొంగి పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లను ముంచెత్తేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్వతీపురం రూపురేఖలను మారాయి. ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో పార్వతీపురంలో ప్రగతి పవనాలు వీస్తున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ. 1.90 కోట్లతో బైపాస్ రోడ్డును నిర్మించారు. పట్టణంలో ముంపు వార్డుల సమస్య పరిష్కారానికి వరహాలగెడ్డలో పూడికలు తొలగించి ముంపు కష్టాలను తీర్చారు. ఇంటిటి చెత్త సేకరణకు పట్టణానికి 10 చెత్తసేకరణ (క్లాప్) వాహనాలు అందించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. మరోవైపు అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారు. పట్టణంలోని మున్సిపల్ పార్కులను అతి సుందరంగా తీర్చిదిద్ది ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్...

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన పట్టణ బైపాస్ రహదారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. ఇందుకు రూ. 1.90 కోట్లు మంజూరు చేశారు.

10 క్లాప్ వాహనాలు ..

గతంలో మురికివాడలు తలపించే వార్డులు ప్రస్తుతం అతి సుందరంగా రూపుదిద్దుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 10 క్లాప్ వాహనాలను పట్టణానికి మంజూరు చేశారు. ప్రతి రోజూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు.

సుందరంగా పార్కులు..

ఒకప్పుడు పట్టణంలో ఉండే ఐదు మున్సిపల్ పార్కులు మందుబాబులు.. జూదర్లకు అడ్డాగా ఉండేవి. 2019 తర్వాత పార్కుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృషి సారించింది. అందులో భాగంగా పార్వతీపురం నడిబొడ్డున ఉన్న సన్యాసిరాజు స్మారక పార్కు, ఎస్ఎన్ఎం నగర్ పార్కులను సుందరంగా తీర్చిదిద్ది వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. అలాగే పార్కుల్లో వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎక్సర్‌సైజ్‌లు చేసుకుంటూ ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకుంటున్నారు.

వరహాలగెడ్డలో పూడికల తీత

వర్షం పడితే చాలు పట్టణంలోని పలు ప్రాంతాల వాసులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. అయితే అదంతా గతం.. ప్రస్తుతం ఆ సమస్య లేదు. వరహాలగెడ్డలో పూడికలు తొలగించడంతో ముంపు సమస్య తప్పింది.

క్రమం తప్పకుండా తాగునీరు..

పార్వతీపురంలో ఏళ్లనాటి తాగునీటి సమస్యకు ప్రభుత్వం చెక్‌పెట్టింది. పట్టణానికి తాగునీటి వనరైన తోటపల్లి నాగావళి నది నుంచి వస్తున్న తాగునీటి పైపులైన్లు పాడవ్వడంతో బురదనీరు వచ్చేది. దీంతో పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలందరికీ తాగునీరు అందిస్తున్నారు. ఇందుకోసం సుమారు 60 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు

రూ. 10 కోట్లతో రోడ్లు..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి రూ. 10 కోట్లు ఖర్చు చేశారు. పట్టణంలోని చినదేవర వీధి, నందమూరి కాలనీ, గంటావీధి, మేదర వీధి, గాంధీ సత్రంవీధి, తాళాబత్తుల వీధి, రెడ్డివీధి, లింగంవీధి, కుసుమగుడి వీధి, గులిపిల్లివీధి, రామాపురం కాలనీ, వివేకానంద కాలనీ, ఎస్ఎన్‌పీ కాలనీ, జనశక్తి కాలనీ, బంగారమ్మకాలనీలలో ఏళ్లనాటి సమస్యను పరిష్కరించి రోడ్లు వేశారు.

పట్టణాన్ని అభివృద్ధి చేశారు..



గతంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉండేది. ప్రస్తుతం పట్టణంలోని రోడ్లపై డివైడర్ల మధ్య ఖాళీ స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించడం.. బైపాస్ రోడ్డు పునఃనిర్మించడం అభినందనీయం. పట్టణంలోని పార్కులు, డివైడర్లపై మొక్కలు వేసి పట్టణాన్ని సుందరీకరించారు. గతంతో పోల్చుకుంటే పార్వతీపురం పట్టణం అభివృద్ధిపథంలో నడుస్తోంది.

– గులిపిల్లి మాధవ్, పార్వతీపురం పట్టణం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



ఒకప్పుడు పట్టణంలో ఆటో నడపాలంటే నరకయాతన అనుభవించే వారం. రోడ్డుపై ఆటో నడుపుతుంటే నెలకోసారి పాడయ్యేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక పట్టణంలోని రోడ్లకు మహర్దశ వచ్చింది. అభివృద్ధి పనులు సాగుతున్నాయి. లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా పథకాల ఆర్థిక సాయం జమవుతోంది. ప్రభుత్వానికి.., జగనన్నకు రుణపడి ఉంటాం.

– బత్తలు కృపారావు, ఆటో డ్రైవర్, పార్వతీపురం

సుందరీకరణకు అధిక ప్రాధాన్యం



పట్టణ సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వార్డుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇంటింటి చెత్త సేకరణకు పది క్లాప్ వాహనాలు వినియోగిస్తున్నాం. తాగునీటి సమస్యను పరిష్కరించాం. ఎప్పటికప్పుడు పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతున్నాం. పార్కుల్లో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ వ్యాయామ పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చాం.

– శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం



పూడికలు తీసిన వరహాలగెడ్డ




సన్యాసిరాజు స్మారక పార్కు

అనుమతుల్లేని సమావేశాలు నిషేధం

సీతానగరం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయపార్టీ నాయకులు ఎటువంటి అనుమతుల్లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎన్నికల సహాయ అధికారి ఎం. ఈశ్వరరావు, పార్వతీపురం సీఐ రవికుమార్, ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరగాల్సిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ సమావేశాలను అనుమతుల్లేని కారణంగా నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల అధికారులు, పోలీసు వారి అనుమతులు తీసుకుని సమావేశాలు, బహిరంగ సభలు, ప్రచారాలు నిర్వహించుకోవాలని సూచించారు.

ఘనంగా కోటదుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం



కోటదుర్గమ్మ ఆలయం

మక్కువ:

మండల కేంద్రంలోని మక్కువ జన్నివీధిలో కోటదుర్గమ్మ తల్లి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వేదపండితులు ఆరవెల్లి విజయకుమార్ శర్మ, మొక్కరాల వెంకటరమణమూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతిరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి సుమారు 3వేల మంది భక్తులు హాజరయ్యారు.

కొరియా గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఒడిశా అధికారులు

సాలూరు రూరల్: ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో వివాదాస్పద గ్రామాలైన కొరియా గంజాయిబద్ర గ్రామాలలో ఒడిశా అధికారులు ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. కొరాపుట్ కలెక్టర్ కీర్తి వాసన్ ఆదేశాల మేరకు పొట్టంగి తహసీల్దార్ బహదూర్ సింగ్‌దరువా, బీడీఓ సుశాంత్ కుమార్ ఓటు విలువను వివరిస్తూ ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి మన ఓటు – మన హక్కు అంటూ నినాదాలు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధిగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు



వెంకంపేట గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: ప్రతి గ్రామంలోనూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని వెంకంపేటలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారన్నారు. ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంటే.. మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు

• మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



నేల బావులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: వేసవిలో తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ అన్నారు. తోటపల్లి పంప్‌హౌస్, నేల బావులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అదనంగా కావాల్సిన నీటి సేకరణకు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన



గుమ్మలక్ష్మీపురం: వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమంలో పాల్గొన్న డెంటల్ అసిస్టెంట్ సర్జన్ ఇతర వైద్యులు, సిబ్బంది

సీతంపేట: వరల్డ్ ఓరల్ హెల్త్‌డేను పురస్కరించుకుని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏరియా ఆస్పత్రి దంత వైద్య నిపుణులు రేణుక బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

నోరు బాగుంటే ఆరోగ్యం బాగు

గుమ్మలక్ష్మీపురం: నోరు బాగుంటే ఆరోగ్యం బాగుంటుందని భద్రగిరి సీహెచ్‌సీ డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పావని అన్నారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా బుధవారం భద్రగిరి సీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంతాలు, చిగుళ్లకు సంబంధించి ఏ చిన్న సమస్య ఉన్న దంత వైద్యులను సంప్రదించాలని, దంత సంరక్షణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భద్రగిరి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, వైద్యులు రమ్య, శ్రీలక్ష్మీ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో కంటిచూపు



వృద్ధుడికి నేత్ర పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ నగేష్ రెడ్డి

పార్వతీపురం టౌన్: కంటి చూపు రక్షణ కోసం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని నెయ్యిలవీధిలో బుధవారం ఆరోగ్యసురక్ష నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలు పరిష్కరించాలనే ధ్యేయంగా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి కళ్లద్దాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకురాలు చామంతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ రూరల్: వేసవిలో కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎం.సింగుపురం సీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. మండలంలోని పెద్ద కోటిపల్లి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాచి చల్లారిన నీటిని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గరుగుబిల్లి: సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు మండల ఉప ఎంపీపీ లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమస్యలపై చర్చ నిర్వహించలేదు. మండల సర్వసభ్య సమావేశం 90రోజుల్లోపు నిర్వహించాల్సి వున్నందున నిబంధనల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ పి.సూర్యనారాయణ తెలిపారు. కోడ్ అమల్లో ఉన్నందున కేవలం సభ్యుల సంతకాలను తీసుకొని సమస్యలపై చర్చించకూడదన్న నియమంతో సమావేశాన్ని ముగించినట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఉప ఎంపీపీ లక్ష్మి, ఎంపీటీసీలు బి.నారాయణమ్మ, డి.సత్యనారాయణ, సీహెచ్ రూపవతితో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు, అర్చకులు, భక్తులు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో 250 ఏళ్ల చరిత్ర కలిగిన సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. పట్టణ గ్రూపు దేవాలయాల ఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బి. జయప్రకాష్ నారాయణ హాజరయ్యారు. ఉదయం 10.10 గంటలకు ప్రముఖ అంజనేయ ఉపాసకులు బ్రహ్మశ్రీ శ్రీనువాసశర్మ, పలువురు రుత్విక్కుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

అనంతరం ధ్వజస్తంభ దాతలు మజ్జి రామం బ్రదర్స్, నూతన కల్యాణ మంటపం నిర్మాణకర్త గౌరీశంకర బాల కుటుంబ సభ్యులను ఈఓ, పట్టణ ప్రముఖులు సత్కరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

జగనన్నకు అండగా ఉంటాం..

• సూరంపేట గ్రామస్తులు



ఎమ్మెల్యే జోగారావును కలిసి సంఘీభావం తెలియజేస్తున్న సూరంపేట వాసులు

సీతానగరం: మండలంలోని ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని సూరంపేట సర్పంచ్ సీహెచ్ అప్పన్నమ్మ, మాజీ సర్పంచ్ సాంబన్నదొర, గ్రామపెద్దలు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే అలజంగి జోగారావును పార్వతీపురంలో బుధవారం కలిసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, నిరంతరం ప్రజలతో మమేకమవుతూ, ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తున్న ఎమ్మెల్యే అలజంగిని గెలిపించి, జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికల నియమాలు పాటిస్తున్నాం..

• పాలకొండ ఆర్డీఓ రమణ

పార్వతీపురం: ఎన్నికల నియమావళి అనుసరిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని కురుపాం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పాలకొండ ఆర్డీఓ ఏవీ రమణ అన్నారు. బుధవారం పలు దినపత్రికల్లో ఎన్నికల నియమావళి స్పందించడం లేదన్న కథనాలు ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గరుగుబిల్లి మండలం సంతోషపురంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రాకముందే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులకు మంజూరు చేసిన కార్డులపై కాని, శిలాఫలకాలపై కాని ప్రజా ప్రతినిధుల చిత్రాలు అంటించడ గాని, సందేశాలు ఇవ్వడం గాని చేయరాదని స్పష్టం చేశారు. తోటపల్లి ప్రాజెక్ట్ కుడి కాలువ వద్ద శంకుస్థాపన శిలాఫలకంపై పేర్లను కప్పివేస్తూ వేసిన సున్నాన్ని తొలగించామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమలయ్యేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

• ఎస్‌బీఐ విశాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్



ఎస్‌బీఐ నూతన శాఖను ప్రారంభిస్తున్న విశాఖపట్నం డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్

జియ్యమ్మవలస: ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్టు ఎస్‌బీఐ విశాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ అన్నారు. జియ్యమ్మవలస మండల కేంద్రంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సేవలను ఈ ప్రాంతీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు, వ్యాపార రుణాలతో పాటు ప్రతీ మహిళా సంఘానికి రూ.20లక్షల వరకు రుణసదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.